ఉప్పల్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం లక్ష్యం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 36 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 02 ఫిబ్రవరి 2026






- సంపన్నుల కోసం హైస్పీడ్ సంస్కరణలు
నిస్సారంగా..నిస్తేజంగా కేంద్ర బడ్జెట్
- రూ.53,47,315 కోట్లతో ప్రతిపాదన
- నిరుత్సాహపర్చిన నిర్మలమ్మ పద్దు
- వేతనజీవులకు దక్కని ఊరట
- వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి
సహా కీలక రంగాలన్నింటికీ నిధుల కోత

# సామాన్యులకు సున్నా

నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది శత కోటీశ్వరుల కోసం యావత్తు దేశ ప్రయోజనాలను బలిపెట్టే ఉదారవాద ఆర్థిక సంస్కరణలను కొనసాగించింది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం రూ.53,47,315 కోట్ల బడ్జెట్ సామాన్యులకు 'సున్నా' చుట్టింది. కార్పొరేట్లకు, శత కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించినప్పుడు గుర్తురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి, వెరసి దేశంలోని అసంఖ్యాక ప్రజానీకానికి ప్రయోజనాలు సమకూర్చాల్సి వచ్చినప్పుడు గుర్తుకు రావడం విచిత్రం! ఫలితంగా సామాన్యుడు కేంద్రంగా ఉన్న అన్ని రంగాల పథకాల్లోనూ ఆర్థిక కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బడ్జెట్'కూ నిధుల కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ నిరాశ తప్పలేదు. ఎన్నిమార్లు కేంద్రమంత్రులు, ప్రధానిని కలిసి ప్రాజెక్టులు ఇవ్వాలని ప్రాధేయపడి, విజ్ఞప్తులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది.

# స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు ఇడి క్లీన్‌చిట్



**అమరావతి , ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎపి సిఎం చంద్రబాబుకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) క్లీన్ చిట్ ఇచ్చింది. రెండు రోజుల కిందట విశాఖపట్నంలోని పిఎంఎల్ఎ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటులో నిధుల మళ్లింపు, నేరపూరిత కార్యకలాపాల్లో చంద్రబాబు ప్రమేయం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని ఇడి స్పష్టంగా పేర్కొంది. ఇడి దర్యాప్తులో భాగంగా మిగతా2లో...

# రాష్ట్రపతి భవన్‌లో అమృత్ ఉద్యాన్..

● ఈ నెల 3 నుంచి ప్రజలకు అందుబాటులో...

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్.. ప్రకృతి అందానికి కూడా పేరెన్నికగన్నది. ముఖ్యంగా ఇక్కడి మొఘల్ గార్డెన్స్, అందులోని పూల మొక్కలు, వాటి పూలు.. ఎంతగానో ఆకట్టుకుంటాయి. అయితే, అంత అందమైన ఇక్కడి ప్రకృతిని ఎప్పుడు పడితే అప్పుడు చూసేయడం కుదరదు. కానీ, ప్రతి ఏడాది కొంతకాలం పాటు సాధారణ ప్రజలకు సందర్శనకు అనుమతిస్తారు.ఈ ఏడాది కూడా అమృత్ ఉద్యాన్ పేరుతో సందర్శనకు అనుమతించనున్నారు. ఈ నెల 3 మంగళవారం నుంచి మార్చి 31 వరకు సందర్శకుల్ని గార్డెన్



లోపలికి అనుమతిస్తారు. ఢిల్లీలో కాలుష్యం ఎక్కువనే సంగతి తెలిసిందే. ఎప్పుడూ కాలుష్యంతో ఇబ్బందిపడే ప్రజలు.. రాష్ట్రపతి భవన్లో ఉన్న మొఘల్ గార్డెన్ పచ్చదనాన్ని, ప్రకృతిని చూసి పరవశించవచ్చు. మిగతా2లో...



## అంబటిపై దాడి.. ఏపీ హైకోర్టు సీరియస్

**అమరావతి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై టీడీపీ నాయకుల దాడి పట్ల ఏపీ హైకోర్టు సీరియస్ అయ్యింది . అంబటి రాంబాబు భార్య విజయలక్ష్మి హైకోర్టులో వేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను కోర్టు విచారించింది. శాంతి భద్రతలు అదుపులోకి మిగతా2లో...

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై చిన్నచూపు: డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్.. అయినా నగరాన్ని విస్మరించారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడారు. " ఫార్మా రంగానికి హైదరాబాద్ ప్రసిద్ధి. కొవిడ్ సమయంలో కీలక ఔషధాలను ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ ఎగుమతి చేసింది. ఆడియో, వీడియో, గేమింగ్, మిగతా2లో...





## 12వ బడ్జెట్‌లోనూ తెలంగాణకు గుండు సున్నానే...

8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా..
తెలంగాణకు తీరని అన్యాయం: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్రంలోని బీజేపీ సర్కారుతో తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర బడ్జెట్‌పై ఎక్స్ వేదికలో స్పందించారు. పన్నెండేండ్లుగా తెలంగాణను మోసం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం మిగతా2లో...

## సుప్రీం అంటే మీరేనా?

మీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందా?
నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు విచారించిన సిట్
ప్రశ్నలు సంధించిన ఆరుగురు అధికారులు
సిట్ సేకరించిన ఆధారాలతో ప్రశ్నలు.. ఎదురు ప్రశ్నించిన కేసీఆర్
విచారణ సమయంలో ఇంటిబయట ఉద్రిక్తత, కార్యకర్తల నిరసనలు



**హైదరాబాద్‌ఫిబ్రవరి1(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సిట్ అధికారులు విచారించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో తన సొంత నివాసంలో ఆయన్ను నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో ఇంటి బయట వేలాది మంది కార్యకర్తల నిరసనలు, మిగతా2లో...



## ఏపీలో మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడి

**హైదరాబాద్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీలోని ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. అంబటి రాంబాబు ఇంటిపై దాడి మరువకముందే తాజాగా ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్ ఇంటిపై దాడికి ప్రయత్నించారు. మిగతా2లో...

## రాష్ట్రంలో కుప్పకూలిన శాంతిభద్రతలు : వైఎస్ జగన్ మండిపాటు



**అమరావతి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఏపీలో శాంతి భద్రతలు కుప్పకూలయ్యాయని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ మూకల దాడికి గురైన మాజీ మంత్రి విడుదల రజిని, మిగతా2లో...

## బలూచిస్థాన్‌లో దాడులు.. 125 మంది మృతి




## సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు..

ప్రతి ప్రశ్నకు కేసీఆర్ కుండ బద్ధలు కొట్టినట్టు బదులిచ్చారు ..!



హైదరాబాద్:ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్): బీఆర్ఎస్ అధినేత కేసీర్ సిట్ విచారణపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదని, అయినా సరే కేసీఆర్‌ను

మిగతా2లో...

# సామాన్యులకు సున్నా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోటీతత్వాన్ని పెంచడం ద్వారా ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆకాంక్షలు నెరవేర్చడం, ప్రతి కుటుంబం సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలు పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు', బాధ్యతలతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ఆదివారం పార్లమెంట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ ఆమె ప్రవేశపెట్టారు. ఆమె బడ్జెట్ ప్రసంగం ప్రారంభించగానే దేశంలోని స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ 1,546.84 పాయింట్లకు, నిఫ్టీ 495.20 పాయింట్ల వద్ద పతనం కావడంతో దాదాపు రూ.10 లక్షల కోట్ల మదుపరుల సంపద తుడిచిపెట్టుకుపోయింది. పన్ను రాయితీలు, ప్రామాణిక తగ్గింపు మార్పులను ఆశించిన ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఎటువంటి ఉపశమనం లభించలేదు. సాంప్రదాయ వైద్య మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రధాన చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా మూడు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సంస్థలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆయుష్ ఫార్మసీల అప్‌గ్రేడ్‌ను బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించారు. ఆయుర్వేద ఆధారిత ఆరోగ్య సంరక్షణ, ఆయుష్ వ్యవస్థ కింద సేవలు మెరుగుపర్చడం, రోగులకు మెరుగైన ఔషధాల లభ్యత వీటి లక్ష్యమని వివరించారు. వైద్యం, పర్యాటకం కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రపంచ సాంప్రదాయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో భారతదేశ పాత్రను బలోపేతం చేయడానికి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్‌ను అప్‌గ్రేడ్ చేస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీలో సామర్థ్యాన్ని మెరుగుపర్చడానికి మొదటి అడుగుగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌లను పునర్నిర్మించాలని ప్రతిపాదించారు.

**బడ్జెట్ నిర్ణయాలు** 1. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించలేదు. ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్న కొత్త పన్నుల్లో ఏవైనా పన్ను మినహాయింపులు, కోతలు ఉండొచ్చని భావించినా.. బడ్జెట్‌లో అలాంటివేమీ ప్రకటించలేదు. అయితే, దేశంలో పెట్టుబడులు పెట్టి, క్లౌడ్ సర్వీసెస్ అందించే డాటా సెంటర్లకు మాత్రం సరళమైన పన్నులు విధించారు. 2. క్యాన్సర్ పేషెంట్లకు ఊరట కలిగిస్తూ, చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయంతో 17 రకాల ఔషధాల ధరలు తగ్గుతాయని చెప్పారు. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. 3. కొత్తగా వచ్చే టెక్నాలజీలపై సమీక్ష జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారు. సెమీ కండక్టర్ల తయారీ సహా, ఇతర సేవారంగాలకు ప్రోత్సాహకంగా ఐదేండ్లలో రూ.40 వేల కోట్లు కేటాయించారు. 4. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగానూ సైన్యానికి రూ.2.19 లక్షల కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కంటే 21.84 శాతం అదనం. మొత్తం రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించారు. 5. వేగంగా, స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు తయారీ రంగం, ఇతర చిన్న పరిశ్రమలు వంటి ఆరు కీలక రంగాలకు ప్రోత్సాహం అందిస్తారు. ఇండియాను బయో గ్లోబల్ ఫార్మా హబ్‌గా మార్చేందుకు బయో ఫార్మా శక్తి మిషన్ పేరుతో ఐదేండ్లలో రూ.10 వేలకోట్లు కేటాయించారు. 6. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసి వస్త్ర తయారీ రంగాన్ని ప్రోత్సహించారు. ఖాదీ, చేతి కళా ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు మహాత్మాగాంధీ గ్రామ సమాజ్ పథకాన్ని ప్రకటించారు. 7. బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. విదేశీ మారక వ్యవస్థను ప్రోత్సహించేందుకు, భారతీయ ఈక్విటీల్లో విదేశీయులు పెట్టుబడులు పెట్టేందుకు కూడా కమిటీలను ఏర్పాటు చేస్తారు. 8. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాలకు ఏడు హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. 9. రేర్ ఎర్త్ మినరల్స్ (అరుదైన ఖనిజాలు) కోసం చైనా వంటి దేశాలపై ఆధారపడకుండా నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తారు. తమిళనాడు, ఏపీ, కేరళ, ఒడిశాల్లో ఈ కారిడార్లు ఏర్పాటవుతాయి. 10. మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రత్యేక హబ్స్ ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆయుష్ కేంద్రాల పేరుతో ఐదు మెడికల్ హబ్స్ ఏర్పాటు చేస్తారు. 11. కేంద్ర ఎన్నికల సంఘానికి ఈ బడ్జెట్‌లో 25.33 శాతం కేటాయింపులు పెంచారు. 2025-26లో రూ.304.98 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.382.22 కోట్లకు పెరిగింది. 12. పట్టణ ప్రాంతాల్లో పేదల ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకానికి 2025-26లో రూ.3,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3,000 కోట్లకు తగ్గించారు. 13. స్వచ్ఛ భారత్ మిషన్‌కు 50శాతం నిధుల కోత విధించారు. 2025-26లో రూ.5వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.2,500 కోట్లకు తగ్గించారు. దేశంలో వాతావరణ సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో కాలుష్య నియంత్రణకు కేటాయింపులు తగ్గించారు. 2025-26లో రూ.1,300 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో 1,091 కోట్లు కేటాయించారు. పడిపోయిన ప్రభుత్వ ఆదాయం అత్యవసర వ్యయంలోనూ తగ్గుదల కేంద్ర ప్రభుత్వ మూలధనం, రెవెన్యూ వసూళ్లు...రెండూ పడిపోయాయి. గత సంవత్సరపు మూలధనపు వసూళ్లను రూ.16.4 లక్షల కోట్లుగా అంచనా వేయగా సవరించిన అంచనాలలో రూ.16.2 లక్షల కోట్లుగా చూపారు. రెవెన్యూ వసూళ్లు అంతకంటే దారుణంగా పడిపోయాయి. రూ.34.2 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేయగా వచ్చింది రూ.33.4 లక్షల కోట్లే. ఇదిలావుండగా ప్రభుత్వ వ్యయం కూడా తగ్గిపోయింది. మూలధనపు వ్యయం రూ.15.5 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేయగా అది రూ.14 లక్షల కోట్లకు తగ్గింది. ఆదాయం, వ్యయం పడిపోతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఈ రెండు పద్దుల కింద అధిక మొత్తాన్ని చూపేందుకు వెనుకాడడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు 4.4 శాతం ఉంటుందని అంచ నా వేశారు. ఖర్చును తగ్గించి చూపించారు. వనరులను పెంచుకో వడంలో ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేకపో వడంతో తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రజలకు అత్యవసరమైన ముఖ్యమైన పథకాలకు పెద్దగా ఖర్చు చేయలేకపోయింది.

**రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త శక్తి బడ్జెట్‌పై ప్రధాని మోడీ** కేంద్ర బడ్జెట్ 2026-27 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుంది. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య కేంద్ర ఆర్థికమంత్రి సమతూకం పాటించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది". ప్రభుత్వ సంస్కరణల ఎజెండాకు రీఫామ్ ఎక్స్‌ప్రెస్ ఇది.

**కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్ ప్రజలకు, రాష్ట్రాలకు వ్యతిరేకం : సీపీఐ(ఎం) తీవ్ర విమర్శ** కార్మికులను, సమాజంలో సామాజికంగా అణచివేతకు గురైన వర్గాలను, అలాగే దేశ విస్తృత ఆర్థిక ప్రయోజనాలను పణంగా పెట్టి కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నులు, కుబేరుల సంకుచిత ప్రయోజనాలను పెంచి పోషించేందుకు మోడీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న రాజీలేని నిబద్ధతకు స్పష్టమైన నిదర్శనమే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అని సీపీఐ(ఎం) విమర్శించింది. సంక్షోభాల దిద్దుబాటేది ?

**ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్ : రాహుల్ గాంధీ** దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాల దిద్దుబాటును బడ్జెట్ విస్మరించింది. "యువత ఉద్యోగాలు కోల్పోవడం, తయారీ రంగం పడిపోవడం, పెట్టుబడిదారులు మూలధనాన్ని వెనక్కితీసుకోవడం , కుటుంబ పొదుపులు పడిపోవడం, రైతులు ఇబ్బందులు, ప్రపంచదేశాల నుంచి పొంచి వున్న ముప్పు గురించి ప్రస్తావించలేదు.

**ధరలు పెరిగేవి** విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడిలు, పాన్ మసాలా, గుట్కా, కాఫీ రోస్టింగ్, వెండింగ్ యంత్రాలు, అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్, చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు,
ఆదాయపు వివరాలు సరిగ్గా చూపని వారికి విధించే జరిమానా 100 శాతం పెంపు బహిర్గతం చేయని చరాస్తులపై ఇప్పుడు జరిమానా విధింపు ఫ్యూచర్స్-ఆప్షన్స్ ట్రేడింగ్

**ధరలు తగ్గేవి** క్యాన్సర్ ఔషధాలు, అరుదైన వ్యాధులు , డయాబెటిక్ మందులు, విద్యుత్తు వాహనాల్లో వాడే ఇవి బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్, విదేశీ యాత్రలపై పన్ను, మైక్రో ఒవెన్స్, విదేశీ విద్య, చెప్పులు, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలు దేశీయంగా తయారయ్యే మొబైల్స్, ట్యాబ్‌లు , ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలు క్యాపిటల్ గూ డ్స్,క్రిటికల్ మినరల్స్‌అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు.

# సుప్రీం అంటే మీరేనా?

(మొదటి పేజీ తరువాయి)

నినాదాలు చేశారు. భారీ బందోబస్తు మధ్య ఆరుగురు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణ పర్వం పూర్తిగా వీడియో రికార్డింగ్ చేశారు. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు నేరుగా సమాధానమిచ్చిన కేసీఆర్ మరికొన్నింటికి ఎదురు ప్రశ్నించారు. ఒక సందర్భంలో ఇదంతా సిల్లీ వ్యవహారమనీ, కేవలం రాజకీయ కక్షతోనే సాగిస్తున్న డ్రామా అంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకు... కేసీఆర్ ఆదివారం భారీ కాన్వాయ్ తో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నందినగర్ నివాసానికి చేరుకున్నారు. ఇతరులు అటువైపు రాకుండా కట్టుసీఆర్ నివాస పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ కమాండెంట్ రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితురాజ్, శంషాబాద్ అదనపు ఎస్పీ ఎఎస్ రావు, ఏసీపీలు శ్రీధర్ రికార్డింగ్ పరికరాలతో ఆయన నివాసానికి చేరుకున్నారు. రెండో అంతస్తులో వెయిట్‌చేస్తున్న సిట్ అధికారుల వద్దకు న్యాయవాదులతో కలిసి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో కేసీఆర్ వచ్చారు. విచారణ గదిలోకి న్యాయవాదులను అనుమతించ లేదు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు మొదటి అంతస్తులో ఉండి పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్నం 3.10గంటలకు విచారణ ప్రారంభించారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు మీకు ముందుగానే తెలుసా..? మీకు అవసరమైన వ్యక్తుల సమాచారం కోసం వారి ఫోన్లు ట్యాపింగ్ చేయమని అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఆదేశించారా? ఈ విషయంలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును కూడా ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలతో అధికారులు విచారణను ప్రారంభిం చినట్టు తెలిసింది.అయితే, ఉదయమే ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంగా ఉన్న తనను కలిసి శాంతిభద్రతల సమాచారం చెప్పేవారనీ, ఆ సమాచారం ఎలా సేకరించారనే విషయం తనకు అప్రస్తుతమని కట్టుసీఆర్ చెప్పినట్టు తెలిసింది. దేశ భద్రత, ప్రభుత్వ సుస్థిరత, మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తుంటారు. అది వారి విధుల్లో భాగమని మీకు తెలియదా? అని అడగ్గా కట్టుసీఆర్ సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. సుప్రీం నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు గతంలో తాము అరెస్ట్ చేసి విచారించిన అధికారులు తెలిపిన విషయాన్ని వివరిస్తూ ..ఆ సుప్రీం మీరేనా? అని కేసీఆర్‌ను ప్రశ్నించగా దానికి ఆయన నేరుగా సమాధానమివ్వలేదని సమాచారం. కాగా, బీఆర్‌ఎస్ పార్టీకి రూ.1100కోట్లకుపైగా నిధులు వ్యాపారులను బెదిరించి ఎలక్టోరల్ బాండ్లు వసూలు చేశారన్న ప్రశ్నలకు కూడా ఆయన సమాధానం ఇవ్వలేదు. కాగా, ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారమనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యల్లో భాగంగా సాధారణంగా నిర్వహించే వ్యవహారమని కేసీఆర్ వాదించినట్టు తెలిసింది. గతంలో సిట్ సేకరించిన సమాచారం, పలు ఆధారాలను కేసీఆర్ ముందుపెట్టి ప్రశ్నించారు. మధ్యలో విరామమిస్తూ రాత్రి 7.45నిమిషాల ప్రాంతంలో విచారణను ముగించి స్టేట్‌మెంట్‌పై కేసీఆర్ సంతకం తీసుకున్నట్టు తెలిసింది. రాత్రి 8గం టల ప్రాంతంలో సిట్ అధికారులు కేసీఆర్ నివాసం నుంచి వెళ్లిపోయారు. కిందికి వచ్చిన కేసీఆర్ అక్కడే ఉన్న కేటీఆర్, హరీశ్‌రావుతో సమావేశమయ్యారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు ఇడి క్లీన్‌చిట్

(మొదటి పేజీ తరువాయి)

డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దానికి సంబంధించిన వ్యక్తులు షెల్ కంపెనీల ద్వారా ప్రభుత్వ నిధులను మళ్లించినట్లు గుర్తించింది. వికాస్ ఖన్వేల్కర్, సుమన్ బోస్ , ఇతరులు ఈ నిధులను సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఇడి తేల్చింది. 2024 అక్టోబర్‌లో రూ.23.5 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. 2023 సెప్టెంబర్‌లో వైసిపి ప్రభుత్వ హయాంలో సిఐడి కూడా కేసులు పెట్టింది. ఆయనను అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలు లో పెట్టింది.కానీ ఒక్క రూపాయి ఆర్థిక లావాదేవీలను చూపించలేకపోయింది. తప్పుగా నమోదు చేసిన కేసుగా చివరికి గుర్తించి విజయవాడ లోని ఎసిబి కోర్టులో క్లోజర్ రిపోర్టును సమర్పించింది. చంద్రబాబుపై మోపిన ఆరోప ణల్లో ఎటువంటి వాస్తవం లేదని సిఐడి తన నివేదికలో వెల ?లడించింది. ఈ నివేదికను అంగీకరిం చిన కోర్టు, జనవరి 13న చంద్రబాబుతో పాటు మరో 36 మందిపై ఉన్న కేసును అధికారికంగా కొట్టివేసింది. ఈ పరిణామాలు రాజకీయంగా, న్యాయపరంగా చంద్రబాబుకు పెద్ద విజయంగా నిలిచాయి. ప్రభుత్వ నిధులను దారి మళ్లించి స్కామ్ చేశారన్న ఆరోపణలను కేంద్ర దర్యాప్తు సంస్థ, రాష్ట్ర దర్యాప్తు సంస్థ రెండూ తోసిపుచ్చడంతో ఈ సుదీర్ఘ న్యాయ వివాదానికి తెరపడింది. అడ్వకేట్ జనరల్ (ఏజి) దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సుదీర్ఘ దర్యా ప్తు తర్వాత చంద్రబాబుతోపాటు పలువురు నేతలకు స్కామ్‌తో ఎలాంటి సంబంధం లేదని కోర్టు నిర్ధారించిందని వెల్లడించారు.

## రాష్ట్రపతి భవన్‌లో అమృత్ ఉద్యాన్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది అమృత్ ఉద్యాన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఏడాది సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాధారణంగా ఇక్కడ ఈ శీతాకాలంలోనే పూల మొక్కలు అందాన్ని సంతరించుకుంటాయి. అందుకే ఈ సమయంలోనే ప్రజల్ని అనుమతిస్తారు. ఈసారి సందర్శకులు 145 రకాల గులాబి మొక్కల్ని చూడొచ్చు. అర్జున, కృష్ణ, అశ్విని వంటి అరుదైన గులాబీలు ఇక్కడ ఉన్నాయి. అలాగే ఇతర 85 రకాల పూల మొక్కలు కనిపిస్తాయి. ప్రతి రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గార్డెన్ సందర్శించవచ్చు. ఐదు గంటల వరకు ఎంట్రీ ఉంటుంది. హోలీ పండుగ రోజు మాత్రం సెలవు రోజు.

## అంబటిపై దాడి.. ఏపీ హైకోర్టు సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేంతవరకు అంబటి కుటుంబానికి 24 గంటలు భద్రత ఇవ్వాలని ఆదేశించింది.తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని పేర్కొంటూ టీడీపీ నాయకులు గుంటూరు జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలు నెలకొ ల్పారు. ఆ ఫ్లెక్సీలను తొలగించాలంటూ అంబటి ఫ్లెక్సీలు ఉన్న చోటుకు కారులో బయలు దేరారు. ఫ్లెక్సీల వద్ద అప్పటికే టీడీపీ నాయకులు కర్రలు చేతపట్టుకుని ఉండడంతో పోలీసులు అంబటిని అక్కడికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.ఈ దశంలో అంబటి చంద్రబాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబటి నివాసం దాడి చేసి ఇంటి అద్దాలను, కిటికిలను , కార్లను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పం టించారు. టీడీపీ నాయకుల ఫిర్యాదుతో అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## రాష్ట్రంలో కుప్పకూలిన శాంతిభద్రతలు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో జగన్ ఫోన్‌లో పరామర్శించారు.రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోందని, వైసీపీ నాయకులు ధైర్యంగా ఉండాలని సూచించారు. చంద్రబాబు ఆటవిక పాలనను ఖండించాలని, పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకుండా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై చిన్నచూపు: డిప్యూటీ సీఎం భట్టి

(మొదటి పేజీ తరువాయి)

మెడికల్ టూరిజం హబ్‌గా ఉంది. ఆరెంజ్ ఎకానమీలోనూ హైదరాబాద్‌ను చిన్నచూపు చూశారు. మూసీ పునరుజ్జీవన పథకానికీ నిధులు ఇవ్వలేదు" అని భట్టి వ్యాఖ్యానించారు.

## ఏపీలో మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

పెట్రోల్ బాంబులు, కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఇంటికి నిప్పుపెట్టారు. జోగి రమేశ్ నివాసంలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ సమయంలో జోగి రమేశ్ తండ్రి, ఆయన సతీమణి, పిల్లలు ఇంట్లోనే ఉండటం గమనార్హం.ఘటన సమయంలో జోగి రమేశ్ తిరుపతిలోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నారు. తిరుపతిలో జోగి రమేశ్ స్పందిస్తూ తన కుటుంబం హత్యకు కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దాడి విషయం తెలుసుకున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆయన్ను ఫోన్‌లో పరామర్శించారు. దాడికి గురైన విడదల రజని, బ్రహ్మనాయుడిని సైతం జగన్ ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

## 12వ బడ్జెట్‌లోనూ తెలంగాణకు గుండు సున్నానే

(మొదటి పేజీ తరువాయి)

అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతూ ఆచరణలో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్టులకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్‌లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి మాత్రం గుండు సున్నా ఇచ్చారని కవిత విమర్శించారు. రూ. 34,367 కోట్లతో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్‌కు క్లియరెన్స్‌లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వటం లేదని గుర్తుచేశారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు..

(మొదటి పేజీ తరువాయి)

విచారణకు సంపూర్ణంగా సహకరించారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగించినట్టుగా సిట్ ప్రశ్నలు వేస్తోందని మండిపడిన ఆయన.. ప్రతి పశ్నకు కుండబద్ధలు కొట్టినట్టు కేసీఆర్ బదులిచ్చారని వెల్లడించారు. సిట్ విచారణ ఎర్రవల్లిలోనే జరిపే విషయంపై కోర్టుకు వెళ్తే తమకు అనుకులూంగా తీర్పు వచ్చేదని.. కానీ తాము అలా చేయలేదని కేటీఆర్ చెప్పారు.కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యాక నందినగర్‌లోని నివాసంలోనే కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకు సిట్ విచారణను కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు. 'ఈ కేసులో లీకులే తప్ప అధారాలు లేవు. ఫోన్ ట్యాపింగ్ కేసులో డొల్లతనం క్రమంగా బయటపడుతోంది. ఎలాంటి తప్పు జరగలేదని తేలిపోయింది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు.

## బలూచిస్థాన్‌లో దాడులు.. 125 మంది మృతి

**హైదరాబాద్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాక్ అధీనంలోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో BLA రెబల్స్, ఆర్మీ మధ్య జరిగిన దాడుల్లో 125 మంది చనిపోయారు. 12 ప్రాంతాల్లో BLA దాడులు చేసిందని, అందులో 18 మంది సెక్యూరిటీ సిబ్బంది, 15 మంది పౌరులు చనిపోగా పలువురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరోవైపు 92 మంది మిలిటెంట్లు చనిపోయినట్లు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భద్రతా వర్గాలు చెప్పాయి. అక్కడ పరిస్థితి పూర్తిగా అదుపులోకి రాలేదని సమాచారం.

# ఉప్పల్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ఉప్పల్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ( ప్రింట్ & ఎలక్ట్రానిక్ ) మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడు గా వడ్డేపల్లి కిషోర్ ఎన్నికయ్యారు. ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టులు కడారి బాలేశం , చంద్రమౌళి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్ , ప్రధాన కార్యదర్శి లుగా ఆనంద నర్సింహారెడ్డి , పెంబళ్ల కుమార్, క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా కొలనుపాక చంద్రమౌళి , సలహదారులుగా కడారి బాలేశం , మాటూరి శ్రీనివాస్ , మచ్చ శ్రీహరి , కంచు శ్రీనివాస్ , డి సురేష్ , పారెల్లి సాగర్, ప్రెస్ క్లబ్ అధికార ప్రతినిధిగా ధూపాటి సురేష్, గౌరవాధ్యక్షులుగా ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ గా పయ్యావుల సంతోష్ , డిప్యూటి జనరల్ సెక్రటరీగా సీసా నాగరాజు , ఉపాధ్యక్షులుగా బోడ ప్రవీణ్ , కందుకూరి ప్రశాంత్ , గోరుకంటి నరేందర్ , దొంతు స్టాలిన్ , కోశాధికారులు గా ఆర్ . యాదగిరి , సారా వెంకటేష్ గౌడ్ , ఆర్గనైజింగ్ కార్యదర్శి లుగా పి. తిరుమల్ రెడ్డి , కొయ్యేడి కరుణాకర్ , ఇడపాక సురేష్ , దొడ్డి శోభన్ , శ్రవణ్ ,డి. మౌలాలి, జాయింట్ సెక్రటరీ లుగా దత్రపు దేవా , బల్ల సూర్యం , ప్రవీణ్ , కె. జీవన్ గౌడ్ సాంస్కృతిక కార్యదర్శి లుగా పబ్బు కిరణ్ , ఉపేందర్ , షేక్ పాషా , ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి.వి.రాజు, విష్ణు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ వెంకట్ రెడ్డి , సోనిశ్రీ , ప్రసాద్ , చంద్రశేఖర్ , అరుణ్ , శ్రీకాంత్ , శ్రీధర్ , సిద్ధు , జి.వెంకటేష్ , సి.చరేష్ , డి.శివ, డి . యం. మౌలాలి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గా వడ్డేపల్లి కిషోర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యలను నిస్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే, యువ జర్నలిస్టులకు మార్గదర్శ కత్వం అందిస్తూ మీడియా వృత్తికి గౌరవం తీసుకొచ్చేలా నూతన కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన కమిటీ ఏర్పాటుతో ఉప్పల్ మీడియా వర్గాల్లో కొత్త ఉత్సాహం నెలకొందని, జర్నలిజం మరింత బలంగా ముందుకు సాగుతుందని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: రాకేష్ గైక్వాడ్





**హైదరాబాద్ ఫిబ్రవరి 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హరి బోలి డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్(సోను భాయ్) అన్నారు. హరిబోలి డివిజన్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, అధికారులతో త్వరలో డివిజన్లో పర్యటించి సమస్యలను విన్నవించి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని, రోడ్లు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం విడ్డూరమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాడుతామని సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని ఈ సందర్భంగా రాకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష ఆస్థాన, బి. రాజ్ కుమార్, ఓంకార్ స్వామి, భాను, నీల భూషణ్ రాయి, రష్మీ ఆస్థాన, సురేఖ సక్సేనా, మేఘన, నిఖిల్ ఆస్థాన, నితీష్ మాతూర్, ముస్కాన్, శ్రీకర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలి

**హైదరాబాద్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిజాయితీపరుడైన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలని సీనియర్ ప్రొఫెసర్ కె.చక్రధర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కోఠిలోని బి.సి.సాధికారత సంస్థ ( బీసీసీఈ) భవన్ లో యూనివర్సిటీ టీచర్స్ & డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డి ఏ టి ఏ) వారు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డి ఏ టి ఎ రాష్ట్ర అధ్యక్షులు ప్రో. మోహినుద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 47మంది యూనివర్సిటీ టీచర్సుకు సిఎఎస్ క్రింద రావలసిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో నెలకొన్న మొత్తం ఖాళీల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ ను విడుదల చేయాలని, ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్న యూనివర్సిటీ వీసీలను తొలగించాలన్నారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు నాణ్యమైన విద్యను అందించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న టీచింగ్ -నాన్ టీచింగ్ సిబ్బందికి యు.జి.సి. నియమ నిబంధనల ప్రకారం జీతభత్యాలు అందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ కె.ఎస్ చక్రధర్ మాట్లాడుతూ, ఒక యూనివర్సిటీలో టీచర్ గా ఉన్న వీ.సి నియంతగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ చర్య ప్రజాస్వామికంగా, అన్యాయంగా అభివర్ణించారు. ప్రజాస్వామిక వాదులందరూ దీన్ని ఖండించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వెంకట్ దాస్ మాట్లాడుతూ, ప్రొఫెసర్లను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం యూనివర్సిటీల పరువు తీస్తున్నారంటూ, సస్పెన్షన్ అక్రమం ఏకపక్షపాతమైనదని మండిపడ్డారు. మనోహర్ సస్పెన్షన్ తర్వాత రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలన్ని స్పందించాయని, విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీలలో నెలకొన్న మొత్తం ఖాళీల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ ను విడుదల చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వన్ని డిమాండ్ ప్రొఫెసర్ వెంకట్ దాస్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యూనివర్సిటీల పరిస్థితి దయనియమైన స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ చరిత్రలోనే టీచర్స్ అసోసియేషన్ కు అధ్యక్షుడి హోదాలో పనిచేసిన ప్రొఫెసర్ ని సస్పెండ్ చేసిన దాఖలాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ యొక్క పోరాట స్ఫూర్తిని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చాలా విషయాల్లో చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. యూనివర్సిటిల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, ప్రొఫెసర్లను రక్షించుకోవడం విద్యార్థులతో పాటు ప్రజలపై కూడా బాధ్యత అని గుర్తుచేస్తూ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రో. కే శ్రీనివాసులు, ప్రో. అన్వర్ ఖాన్, ప్రో. కే. వై. రత్నం, ప్రో. వెంకటదాసు, వొలిగి ప్రభాకర్, ప్రో. ఎం. నరసయ్య, ప్రో. ఎం స్వామి దాసు, ఓయూ ప్రొఫెసర్లు. రామచందర్, మాధురి శశికళ, గన్నారపు సరోజ తదితరులు పాల్గొన్నారు.




# కన్నాయిగూడెం మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ములుగు జిల్లా, ఫిబ్రవరి 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** కన్నాయిగూడెం మండలం కన్నాయిగూడెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఆదివారం రోజున మంత్రి వర్యులు సీతక్క ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షులు పైడకుల అశోక్, యువనేత సూర్య సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ అప్సర్ పాషా, మండల ఇంచార్జి (సర్పంచ్) జాడి రాంబాబు ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు అందించిన మొత్తం వివరాలుపైక్ తజీనా (లక్ష్మీపుర్) 15,000కుందారపు సంతోష్ (గుర్రవుల) 30,500కుమ్మరి చింపిరక్క (బుట్టాయిగూడెం) 20,000కాంపెల్లి సుష్మిత (కంతనపల్లి) 11,000ఇట్టెం సుదర్శన్ (ముప్పనపల్లి) 30,000జాడి సమ్మక్క (బుట్టాయిగూడెం) 17,500పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో SC/ST జిల్లా మెంబర్ సునార్కని రాంబాబు, కంతనపల్లి సర్పంచ్ చింతే చంద్రయ్య, బుట్టాయిగూడెం ఉప సర్పంచ్ కుమ్మరి సమత సంతోష్, వార్డు మెంబర్లు కుమ్మరి కుమార్, జాడి సమయ్య, తుడుందెబ్బ మండల అధ్యక్షులు గుండ్ల పాపారావు, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గందర్ల నర్సింగారావు, మండల యూత్ ఉపాధ్యక్షులు కుమ్మరి వెంకట్, బుట్టాయిగూడెం గ్రామ యూత్ అధ్యక్షులు జనగాం వసంత రావు, మండల యూత్ నాయకులు జాడి నరేష్, కుమ్మరి రవీందర్, జాడి భైరేష్, కొండగొర్ల నర్సింగరావు, కుమ్మరి కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పొలంలో ఉరి వేసుకుని 'రైతు ఆత్మహత్య'

● బండూరు గ్రామంలో విషాద ఘటన-పోలీసులు కేసు నమోదు.



**బొమ్మనహాళ్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని బండూరు గ్రామంలో ఆదివారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాటిల్ ఉమాపతి (59) గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకుడఉమాపతి గతంలో సొంత గ్రామంలో ఉన్న మూడు ఎకరాల పొలాన్ని అమ్ముకొని ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లి సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం గడిపేవాడు. రెండు రోజుల క్రితం బెంగళూరు నుంచి సొంత గ్రామానికి వచ్చిన ఉమాపతి, తాను గతంలో అమ్మిన అదే పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం పొలాలకు వెళ్లిన గ్రామస్తులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బొమ్మనహాళ్ ఎస్సై నబీ రసూల్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి వివరాలు సేకరించారు. సుమారు 15 సంవత్సరాల క్రితం గ్రామాన్ని విడిచి బెంగళూరులో జీవనం సాగించిన ఉమాపతి, తిరిగి స్వగ్రామానికి వచ్చి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నబీ రసూల్ తెలిపారు.

# అంబటి రాజకీయాల్లో హుందాతనం నేర్చుకో లేదంటే చరిత్ర హీనులుగా నిలిచిపోతావు..!

● కడప డిసిసి బ్యాంక్ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి.



**బద్వేలు ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):-** 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై పై నోరు పారేసుకోవడం నీ అవివేకానికి పరాకాష్టని, ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపిన అంబటి రాంబాబులో ఏమాత్రం మార్పు రాలేదని కడప డిసిసి బ్యాంకు చైర్మన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ....నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు ఏం వెలగబెట్టావో రాష్ట్రం మొత్తం చూసిందని, నీ నీచమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ప్రజలే నీ నోటికి తాళం వేస్తారని, రాజకీయాల్లో హుందాతనం నేర్చుకో, లేదంటే చరిత్ర హీనుడివిగా మిగిలిపోతావు అని తెలిపారు. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం ప్రజా జీవితంలో ఉన్న నాయకులకు ఏమాత్రం శోభించవు, ఇటువంటి వ్యాఖ్యలతో అంబటి రాంబాబు తన రాజకీయ అవగాహన స్థాయిని, సంస్కార రాహిత్యాన్ని ప్రజల ముందు మరోసారి బయటపెట్టుకున్నారని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం కేవలం రాజకీయ దౌర్భాగ్యమే కాకుండా, ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యని, ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఇటువంటి నీచ వ్యాఖ్యలను ఖండించాలి. అంబటి రాంబాబు వెంటనే తన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో అయినా రాజకీయ హద్దులు, సంస్కారాలు పాటించాలని డిమాండ్ చేశారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం లక్ష్యం

● ఎలక్షన్ల సన్నాహక సమావేశంలో పాల్గొన్న స్క్రీనింగ్ కమిటీ కన్వీనర్ నాగండ్ల దీపక్ చౌదరి ● ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి కొండ సురేఖ, మట్ట రాగమయి



**సత్తుపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాబోయే సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మున్సిపల్ ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీ కన్వీనర్, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథులుగా స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ దేవాదాయ శాఖ మరియు పర్యావరణ శాఖ మాత్యులు కొండ సురేఖ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టరాగమై హాజరయ్యారు. ఈ సందర్భంగా నాకండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను ఓట్లుగా మార్చుకునే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, సామాజిక న్యాయం, ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఐక్యతతో ముందుకు సాగితే కాంగ్రెస్ జెండా మున్సిపాలిటీలో ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక



## జిల్లా జగదీష్ ఆధ్వర్యంలో కొండగట్టు గిరిప్రదక్షిణ



**గంగాధర ఫిబ్రవరి 1(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొండగట్టులో ఈరోజు జై శ్రీ రామ్ జై హనుమాన్ వాసవీ క్లబ్ కాపుల్స్ కేఎన్ఆర్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ అద్వర్యములో...మాఘ పౌర్ణమి సందర్భముగా కొండ గట్టు ఆంజనేయ స్వామి సన్నిదీ లో సురేశ్ ఆత్మారం గురువు ఆద్వర్యములో సుమారు 10000 మంది భక్తులచే గిరి ప్రదీక్షణ జై శ్రీ రామ్ జై హనుమాన్ హనుమాన్ చాలీసా పారా యణం చే భక్తుల అంటూ ఉత్సాహంగా గిరి ప్రదీక్షణ చేసారు.

## గంగాధర హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో...



**గంగాధర ఫిబ్రవరి 1(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ లో ప్రతి నెల జరిగే గంగాధర మండల హనుమాన్ యూత్ ఆద్వర్యంలో బాడీ ఫ్రీజర్ కొనడం జరిగింది.ఇట్టి బాడీ ఫ్రీజర్ మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటది అని హనుమాన్ యూత్ అధ్యక్షులు, మధురానగర్ గ్రామ సర్పంచ్ వేముల భాస్కర్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో యూత్ కార్యదర్శి మిట్ట నర్సయ్య మరియు యూత్ సభ్యులు తిరుపతి,అంజి,చందు, గవాస్కర్,అనిల్, శీను,రాజు,మల్లేశం,కరుణాకర్,వినయ్,సతీష్,మహేష్,భారత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసిన తెలుగుతమ్ముళ్లు.



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు జనవరి 31 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పుంగనూరులో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను తెలుగు తమ్ముళ్లు దగ్ధం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చల్లా బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసిపి మాజీమంత్రి అంబటి రాంబాబు అసభ్యకర పదజాలంతో చేసిన వ్యాఖ్యలను త్రీవంగా ఖండించారు. వైసిపి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పినా తమ తీరుమారలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఏ స్క్రిప్ట్ రాసిస్తారో అదే స్క్రిప్ట్ ను వైసీపీ నాయకులు మాట్లాడతారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు ఇంటిపై దాడిని ఖండించిన పెద్దిరెడ్డి



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడిని మాజీమంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం పుంగనూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి రెడ్ బుక్ పేరుతో అరాచక పాలన సాగిస్తోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయడంపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఆయన ఎద్దేవా చేశారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **మూడు చక్రాల వాహనాల పంపిణీకి కృతజ్ఞతగా సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం**

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** దివ్యాంగుల సంక్షేమాన్ని అగ్రప్రాధాన్యంగా తీసుకుని అనేక వినూత్న పథకాలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు త్రీ వీల్స్ మోటార్ వెహికిల్స్ అందించి వారి జీవనోపాధికి భరోసా కల్పించిన సందర్భంగా ఖమ్మం జిల్లా దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య హర్షం వ్యక్తం చేశారు.ఖమ్మం నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి



ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కుంచం ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మి వెంకన్న మాట్లాడుతూ, దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో దివ్యాంగుల సంక్షేమానికి కేవలం రూ.64 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే రూ.100 కోట్లు వెచ్చించి దివ్యాంగుల పక్షాన చరిత్ర సృష్టించిందన్నారు. శారీరక దివ్యాంగులు, అంధులు, బధిరులకు బ్యాటరీ వీల్‌చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్‌మెంట్స్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్ ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు. అలాగే ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే కళ్యాణలక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సెక్రటరీ తాటికొండ రమేష్, బోనకల్ మండల అధ్యక్షులు షేక్ ముస్తఫా, ఉపాధ్యక్షులు భూపతి, ముదిగొండ మండల అధ్యక్షులు నూకపోగు కోటి, జిల్లా నాయకులు షేక్ జానీ, ప్రకాష్ సాంబయ్య, సుధాకర్, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల నడ్డి విరిచే కేంద్ర బడ్జెట్

- **కార్పొరేట్లకు మేలు, సామాన్యులకు నిరాశలు తప్ప మరొకటి లేదు నూతి సత్యనారాయణ గౌడ్**

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజలను పూర్తిగా విస్మరించి, కార్పొరేట్ సంస్థలు మరియు సంపన్న వర్గాలకు అనుకూలంగా రూపొందించబడిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎక్కడా పరిష్కార మార్గం చూపలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని, జనాభాలో సగానికి పైగా ఉన్న యువత ఉద్యోగాల లేమితో ఇబ్బందులు పడుతున్నా ఉద్యోగ, ఉపాధి కల్పన అంశాన్ని బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించడం దురదృష్టకరమన్నారు. వాస్తవ పరిస్థితులకు దూరంగా కేవలం అంకెల గారడీతో బడ్జెట్‌ను చూపించారని ఆరోపించారు.మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల జీవన సమస్యలపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం ఈ బడ్జెట్ వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతుందన్నారు. గ్రామీణ పేదలకు కీలకమైన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరుమార్పుతో నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని, కేటాయింపుల్లో 40 శాతం రాష్ట్రాలే భరించాలని చెప్పడం ద్వారా కేంద్ర ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు.విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించడం దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, విద్యావైద్య రంగాల పట్ల నిర్లక్ష్య ధోరణితో భారతదేశం ఎలా పురోగమిస్తుందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని నూతి సత్యనారాయణ గౌడ్ ప్రశ్నించారు. దేశ జనాభాలో మెజార్టీ ఆధారపడిన వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత లేకపోవడం రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు.రసాయనిక ఎరువుల ధరల పెరుగుదల, దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయే పరిస్థితి ఉందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. రూ.53 లక్షల కోట్ల బడ్జెట్‌ను చూపించినప్పటికీ ఆదాయ మార్గాలపై స్పష్టత లేదని, అప్పులపై ఆధారపడే విధానం వల్ల ద్రవ్యలోటు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. మొత్తం బడ్జెట్‌లో 27 శాతం వడ్డీలకే వెచ్చించాల్సి వస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.కార్మిక వర్గాన్ని



ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఇప్పటికే లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులను హరించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సంక్షేమాన్ని కూడా దూరం చేస్తోందని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం మరోసారి వివక్షను ప్రదర్శించిందని, ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే కనీస కేటాయింపులు కూడా చేయలేదని నూతి సత్యనారాయణ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కార్పొరేట్, సంపన్న వర్గాలకు అనుకూలమైన బడ్జెట్ తప్ప సామాన్య ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో వ్యూహాత్మంగా వ్యవహరించాలి: మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...

**తిమ్మాపూర్,ఫిబ్రవరి01(పీసీడబ్ల్యూ న్యూస్):** కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యకుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యకుడు బండారి రమేశ్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, గెలుపు కోసం అందరం కష్టపడి పని చేయడమే కాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా మనమంతా పని చేయాలన్నారు.ముఖ్యంగా ఆయన మద్దతుగా నిర్వహించే ప్రచార కార్యక్రమాల్లో మండలానికి చెందిన పార్టీశ్రేణులంతా పాల్గొనాలని ఆయన కోరారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలేమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. 8వ డివిజన్ తోసహా కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తేనే గెలుపు ఖాయమవుతుందన్నారు.8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎలాంటి భేషజాలు లేకుండా పార్టీ గెలుపు కోసం పని చేయాలని ఆయన



కోరారు.ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, మాజీ డివిజన్ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్, పొన్నాల సంపత్, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్,చింతల లక్ష్మారెడ్డి, తమ్మనవేణి రాములు యాదవ్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లునూర్‌లో కవ్వంపల్లి విస్తృత ప్రచారం...





**కరీంనగర్,ఫిబ్రవరి01(పీసీడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధిలో అల్గునూరు అగ్రగామిగా నిలవాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలను కోరారు.ఆదివారం కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డితో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. అంతేకాకుండా వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టంగట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే అల్గునూర్ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అధికార పార్టీకి చెందిన వారిని గెలిపించుకుంటే



అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండే గోపు మల్లారెడ్డిని కార్పొరేటర్ గా గెలిపించాలని ఆయన కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యకుడు తమ్మనవేణి రమేష్ యాదవ్, మాజీ డివిజన్ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి, కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, సింగం శ్రీనివాస్, మామిడి నరేందర్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్, పొన్నాల సంపత్, ఐతం మహేశ్, అట్ల అనిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.క్లాస్మేట్ల మద్దతుకాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి అతని క్లాస్మేట్లు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వారంతా కలిసి మద్దతు తెలపడమే కాకుండా ఆయన తరఫున ప్రచారం కూడా నిర్వహించారు. కౌండిన్య యూత్ సభ్యులమద్దతుగోపు మల్లారెడ్డికి కౌండిన్య యూత్ క్లబ్ సభ్యులు మద్దతు ప్రకటించారు. ఆదివారం మల్లారెడ్డిని కలిసి ఆయనకు మద్దతు తెలిపారు. గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా మున్సిపల్ సమరశంఖారావం : మంత్రి కొండా సురేఖ





### సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ చేరాలి
### ఐక్యతే విజయానికి మార్గం ఏదులాపురం ఎన్నికల సన్నాహక సభలో స్పష్టం

**ఏదులాపురం, ప్రతినిధి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా కార్యకర్తలంతా ఏకతాటిపై నిలిచి యుద్ధప్రాతిపదికన పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌కు అజేయ ఆయుధాలని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ఘన విజయం సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదిలి ప్రతి వార్డులో పార్టీ బలం కనిపించేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. **ఐక్యతే కాంగ్రెస్ బలం** పార్టీలో అభిప్రాయ భేదాలు సహజమేనని, అయితే ఎన్నికల వేళ అవన్నీ పక్కనపెట్టి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి హితవు పలికారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు కాంగ్రెస్ నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, అంతర్గత విభేదాలు మూడో శక్తికి లాభం చేకూరుస్తాయని హెచ్చరించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి వార్డుకు ఒక్క అభ్యర్థిగా బరిలో నిలవాలని స్పష్టం చేశారు. **సంక్షేమమే గెలుపు మంత్రం** 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి పథకాలు ప్రజల జీవన స్థాయిని మార్చాయని మంత్రి గుర్తు చేశారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆమె ఆవిష్కరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, అదే ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘన విజయం అందించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. **ప్రచారానికి సర్వం సిద్ధం** సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బిఫామ్‌లు అందజేస్తామని, వెంటనే ముమ్మర ప్రచారం ప్రారంభించాలని మంత్రి తెలిపారు. వార్డుల్లో విజయం సాధిస్తేనే మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కుతుందని, అది ఐక్యతతోనే సాధ్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు 'బడ్జెట్' భరోసా సాగు రంగానికి కేంద్రం పెద్దపీట

● సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీజేపీ కిసాన్ మోర్చా, తెలంగాణ



**గంగాధర ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు పూర్తి భరోసా కల్పించేలా ఉందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 2013-14లో కేవలం 21,933 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, నేడు సుమారు ఎనిమిదింతలు పెరిగి 1.62 లక్షల కోట్లకు చేరడం శుభపరిణామం. తెలంగాణ పత్తికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ప్రత్యేక 'టెక్స్‌టైల్ క్రాప్ మిషన్'ను ప్రకటించడం, రాష్ట్రంలో కొత్తగా క్వాలిటీ టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటు కు పూనుకోవడం అభినందనీయం. నూనెగింజల జాతీయ మిషన్ కింద తెలంగాణలోని ఆయిల్ పామ్ తోటలకు భారీగా సబ్సిడీలు అందనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నిజామాబాద్ సోయాబీన్ సాగుకు కూడా ఊతం అందనుంది ఖమ్మం, వరంగల్ మిర్చి రైతులకు, నిజామాబాద్ పసుపు రైతులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఎగుమతి చేసుకునేలా అగ్రి ఎక్స్‌పోర్ట్ జోన్ లకు నిధుల కేటాయింపు జరిగింది. హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్‌కు నిధుల పెంపు ద్వారా తెలంగాణ చిరుధాన్యాల 'శ్రీ అన్న' సాగులో దేశానికే దిక్సూచిగా మారనుంది. డిజిటల్ వ్యవసాయం: 60 లక్షల మంది రైతులకు డిజిటల్ నమోదు ద్వారా పట్టా రైతులతో పాటు కౌలు రైతులకు కూడా సులభంగా రుణాలు అందనున్నాయి.

# అభివృద్ధికే ఓటేయండి... కాంగ్రెస్‌తోనే సమగ్ర అభివృద్ధి: మంత్రి కొండా సురేఖ పిలుపు



**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, రాష్ట్ర అటవీపర్యావరణదేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, గత పాలకులు ప్రజా శ్రేయస్సును విస్మరించి పరిపాలన సాగించారని తీవ్ర విమర్శలు గుప్పించారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా, డబుల్ బెడ్‌రూమ్ పథకాన్ని తూతూ మంత్రంగా కొనసాగించి, కోట్లాది రూపాయలు దండుకోవటమే లక్ష్యంగా పాలన చేశారని ఆరోపించారు. దీనికి గాను ప్రజలు తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ప్రజాపాలన సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుపేదలకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు రుణమాఫీ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందామని చెప్పారు. ఇటీవల జరిగిన గ్రామీణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అధిక సంఖ్యలో విజయం సాధించడమే ప్రజా ప్రభుత్వానికి లభించిన మద్దతుకు నిదర్శనమని అన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీల అభివృద్ధికీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్న మంత్రి, ప్రజల సహకారంతో మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ వార్డులలో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ నాయకత్వం సూచనల మేరకు అభ్యర్థుల ఎంపిక సజావుగా జరుగుతుందని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధినాయకత్వానికి వివరించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పాత్రికేయులు ప్రజా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కూడా మంత్రి కోరారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజెండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, జెర్రిపోతుల అంజనీ కుమార్, ముళ్లపాటి సీతారాములు, రంగా జనార్ధన్, ఏలూరి రవికుమార్, గజ్జి సూర్యనారాయణ, బచ్చలకూరి నాగరాజు, బెజ్జం గంగాధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాయిపేటలో ఉచిత వైద్య శిబిరం: 200 మందికి పరీక్షలు



**గంగాధర ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామంలో వజ్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్, బీజేపీ నాయకులు గుంట రవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. ప్రముఖ ఛాతి వ్యాధి నిపుణులు డాక్టర్ సుమన్ కుమార్, డాక్టర్ నల్ల దిలీప్ లు సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా శ్వాస, ఛాతి సమస్యలు, జ్వరం, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మరియు మధుమేహం వంటి రుగ్మతలతో బాధపడుతున్న వారికి తగిన చికిత్స అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనరిక్ మందులను వినియోగించుకోవాలి: గుంట రవిఈ సందర్భంగా గుంట రవి మాట్లాడుతూ, చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో నడుస్తున్న జనరిక్ మెడికల్ షాపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. "కేంద్ర ప్రభుత్వం అందించే జనరిక్ మందులు బయట మార్కెట్ ధరలో కేవలం 10 నుంచి 25 శాతం ధరకే లభిస్తున్నాయని చొప్పదండి రైతు. సహకార సంఘం ఎటువంటి లాభాపేక్ష లేకుండా వీటిని అందిస్తోంది. ప్రజలు ఖరీదైన మందుల వైపు వెళ్లకుండా, తక్కువ ధరకే నాణ్యమైన మందులు లభించే జనరిక్ షాపులను ప్రోత్సహించాలి అంటూ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ తిరుమల-కొమురయ్య, సింగిరెడ్డి అశోక్ రెడ్డి, పెరుమాండ్ల రవీందర్, కొలిపాక మల్లేశం, వెల్మ హన్మంతరెడ్డి, చంటి బాబు, గంగస్వామి, వెల్మ లత, సుద్దాల రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కూరపాటి మల్టీ స్పెషాలిటీ & చిల్డ్రన్ హాస్పిటల్ ప్రారంభం





### ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూరపాటి ప్రత్యేకత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరపాటి మల్టీ స్పెషాలిటీ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌ను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైద్య రంగంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం, అందుబాటు ధరల్లో అందిస్తున్న ఘనత కూరపాటి కుటుంబానిదేనని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కూరపాటి చిల్డ్రన్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు సుపరిచితులైన డాక్టర్ ప్రదీప్ కుమార్, వైద్య సేవలతో పాటు క్రీడా రంగం, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా తలసీమియా బాధిత పిల్లలకు ఉచిత వైద్యం, రక్తదానం ద్వారా వారి జీవితాల్లో ఆశలు నింపుతున్నారని కొనియాడారు. డాక్టర్ ప్రదీప్ కుమార్ తండ్రి కూరపాటి వెంకటేశ్వర్లు తనకు ఎంతో కాలంగా సుపరిచితులని, రాజకీయాలు మరియు వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారని మంత్రి గుర్తుచేశారు. అలాంటి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన డాక్టర్ ప్రదీప్ కుమార్ ఖమ్మం జిల్లాలో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ నూతన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా జిల్లా ప్రజలకు ఇంకా విస్తృతమైన, ఆధునిక వైద్య సేవలు అందించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలి నేని నరేందర్, కాంగ్రెస్ నాయకులు ముక్తార్, ఖమ్మం కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, చింతనిప్పు కృష్ణచైతన్య, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

# 50వ డివిజన్లో ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టిన బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బోయినపల్లి ప్రవీణ్ రావు...




**కరీంనగర్, ఫిబ్రవరి01 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం 50 వ డివిజన్లో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బోయినపల్లి ప్రవీణ్ రావు ఆదివారం రోజున ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ 2014 లో కేంద్రంలోఅధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో కరీంనగర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కరీంనగర్కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందని, గత 11 ఏళ్ళుగా కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం వందల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. నిధుల కేటాయింపు కోసం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసంమోడీ ప్రభుత్వం కేటాయించిన నిధుల గురించి గ్రహించి, జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి అండగా నిలవాలని కోరారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం, నగర రూపురేఖలు మార్చడానికి ప్రయత్నించింది మాత్రం కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వమనేది నగ్న సత్యమన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పగ్గాలు నాడు బీఆర్ఎస్ చేతిలో ఉన్న , బిజెపి అధికారం లో లేకపోయినా కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసమే నిరంతరం ఆలోచన చేసిందనీ, ఆ దిశగానే వందల కోట్ల నిధులతో కరీంనగర్ అభివృద్ధి కోసం కృషి చేసిన బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఒక అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సహాయ సహకారాలతో పట్టణం, 50 వ మరింత శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

# భారమైన బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలమ్మ: వినోద్ ముదిరాజ్

● కేంద్ర ప్రభుత్వానికి సామాన్యుడి పై కనికరం లేదా..? ● సామాన్యుడికి అందని బడ్జెట్ ● బడా బాబులకే బిజెపి ఫలాలు



**హైదరాబాద్ ఫిబ్రవరి 01(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ బడా బాబులకు, బిజెపి పార్టీకి వత్తాసు పలికే కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన బడ్జెట్ లా ఉందని టిపిసిసి సభ్యులు న్యాయవాది వినోద్ ముదిరాజ్ అన్నారు. ఇది మధ్యతరగతికి పేరుకే ఊరట, పేదలకు ప్రకటనలే ఎక్కువ నిజమైన ఆర్థిక మద్దతు లేదన్నారుద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల నియంత్రణలోకి వచ్చేలా లేవన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలపై ఎలాంటి కఠిన చర్యలు లేవనిధరలు పెరుగుతుంటే మాటలతో కడుపు నిండదన్నారు.ఉద్యోగాలు పెరిగే అవకాశం లేదు ఉన్న ఉద్యోగాలు కూడా పోయేలా ఉన్నాయన్నారు. ఈ బడ్జెట్లో ఉద్యోగాలపై స్పష్టమైన ప్లాన్ లేదని, యువతకు నిరుద్యోగులకు ప్రత్యక్ష ఉద్యోగ హామీ లేవని,గ్రోత్ వస్తే ఉద్యోగాలు వస్తాయి అన్న ఆశాభావమే తప్ప ఉద్యోగాలు మాత్రం రావని జోష్యం చెప్పారు.ఈ బడ్జెట్ లో విద్య, వైద్యం కేటాయింపులు 140 కోట్ల జనాభాకు సరిపోవన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ఇంకా నిధుల కొరతతోనే ఉన్నాయని, ప్రజలు ఖరీదైన ప్రైవేట్ సేవలకే వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని చెప్పారు. చిన్న వ్యాపారాలు, స్టార్టప్లకు మద్దతు లేని పరిస్థితి,జీఎస్టీ భారం, రుణాలు అందకపోవడం, ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఎం ఎస్ ఎం ఈ లు ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. రైతులు, గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోలేదని,రైతులకు కావలసింది ఆదాయ భద్రత, ఎం.ఎస్.పి గ్యారెంటీ లేదు, అప్పు మాఫీ లేదు, ఎరువులువిత్తనాల ధరల నియంత్రణ లేదన్నారు.మొత్తంగా ఈ బడ్జెట్ పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చే బడ్జెట్, కానీ సాధారణ ప్రజలకు ఊరట ఇవ్వని బడ్జెట్ ఉందన్నారు. పన్నుల విధానం న్యాయపరంగా లేదని, సాలరీ వర్గంపైనే ఎక్కువ భారం పడిందని, పరోక్ష పన్నులు పేదల్ని ఎక్కువగా దెబ్బతీస్తున్నాయన్నారు.ఇదే కాకుండా 2026 ఏప్రిల్ నుండి కొత్త ఐటి పన్నులు వస్తాయని ప్రకటించడం ఆ భారం పేద ,మధ్య తరగతి ప్రజల పైన పడే అవకాశం ఉంది.బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ సామాన్యులపై గుదిబండ గా మారిందని, రోజురోజుకీ బంగారం ధర, సిల్వర్ ధర, కాపర్ ధర, ఆకాశాన్ని అంటే విధంగా ముందుకు వెళ్తుంటే దీని నియంత్రణలో పెట్టలేని దినమైన పరిస్థితి ఈ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉందని వినోద్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# తొర్రూర్‌లో ఇద్దరు నిందితుల నుండి గంజాయి స్వాధీనం

- నిందితుల నుండి 4.5 కిలోల గంజాయి ,అరెస్ట్, జైలుకు తరలింపు.
- పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించిన తొర్రూర్ డి.ఎస్.పి కృష్ణ కిషోర్.



**తొర్రూరు ప్రతినిధి, ఫిబ్రవరి 1(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణం లో ఇద్దరు నిందితుల నుండి 4.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసిజైలుకు తరలించారు అధికారుల ఆదేశాల మేరకు ఎం. శివరామకృష్ణ, ఎస్సై 2 పిఎస్ తొర్రూర్ వారి సిబ్బందితో ఆదివారం ఉదయం తొర్రూర్ బస్టాండ్ లో పెట్రోలింగ్ చేయుచుండగా, హైదరాబాద్ బస్సు ప్లాట్ ఫారం నెంబర్-02 వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు విశాఖపట్నం నుండి హైద్రాబాద్ కు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు అని తెలిసినది. విచారణలో మొదటి నిందితుడు అయిన గంధం యాకయ్య, తండ్రి: రాములు, 26 సంవత్సరములు, కులం: మాదిగ, స్వగ్రామం వనపర్తి మరియు ఇతని గ్రామానికి చెందిన మరొక వ్యక్తి (జువైనల్) ఇద్దరు హైద్రాబాబుద్ లో ఉండే క్రమం లో గంజాయి తాగుటకు బానిసై, విశాఖపట్నంలో గంజాయి ఎక్కువగా దొరుకుతుందని హైదరాబాద్లో కొందరు ద్వారా తెలుసుకొని, ఇప్పటికీ మూడుసార్లు అక్కడికి వెళ్లి గంజాయి గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయిని కొనుక్కొని హైదరాబాదుకువచ్చి వారు కొంచెం తాగుటకు ఉంచుకొని, మిగతాది అక్కడ గంజాయి తాగే వారికి అమ్ముకునేవారు. ఈ క్రమంలోనే వీరు గత రెండు రోజులు క్రితం విశాఖపట్నం కు వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేసి తిరిగి రైల్లో వెళితే తనిఖీలు ఎక్కువ ఉన్నాయని, బస్సు మార్గం ఉత్తమమని విశాఖపట్నం నుండి బయలుదేరి విజయవాడ ఖమ్మం మీదుగా తొర్రూర్ కి వచ్చి తొర్రూర్ నుండి హైదరాబాద్ వెళ్లాలని అనుకున్నారు. అదే మాదిరిగా తొర్రూర్ కి ఆదివారం ఒకటో తేదీ ఉదయశీ 07.30 గంటలకు తొర్రూర్ బస్టాండ్ కు రాగా, తొర్రూర్ పోలీస్ లకు ఇక్కడ పట్టుబడినారు. వీరిని టి .గణేష్, తొర్రూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అరెస్ట్ చేసి జుడీష్యల్ రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు 1. మొత్తం గంజాయి ఖ+ం 4.555 గ్రాములు, ఇట్టి గంజాయి విలువ రూ. 2,27,500/-గా ఉన్నది. 2. ఇద్దరి నిందితుల నుండి రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తొర్రూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో తొర్రూరు డిఎస్పి కృష్ణ కిషోర్ వివరాలను వెల్లడించారు

## కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన రాస్తారోకో..



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 01(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నాయకులు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఈ రాస్తారోకో చేపట్టినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.నిరసన కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

# కేసీఆర్‌పై రాజకీయ వేధింపులు మానాలి : డా.దాసోజు శ్రవణ్ ఎమ్మెల్సీ

● సిట్ విచారణకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ నల్ల రిబ్బన్ నిరసన ర్యాలీ





**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ వేధింపులు, అక్రమ సిట్ విచారణకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు.ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసం నుండి అంబేద్కర్ చౌక్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని నిరసనకు నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు.నిరసన అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా మర్చిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కేసీఆర్ ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రమ కేసులు, సిట్ విచారణల పేరుతో బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సమస్యలను పక్కన పెట్టి నియంతృత్వ పాలన సాగిస్తోందని విమర్శించారు.తమ నియంకుశ పాలనను ప్రశ్నించిన వారిపై కక్షపూరిత చర్యలకు దిగుతుందని అన్నారు.ప్రజలంతా ఈ విషయాన్ని గమనిస్తున్నారని, దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను మర్చిపోయి అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. ఇకపై ప్రజలను మభ్య పెట్టడం సాధ్యం కాదని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ హెచ్చరించారు.

# రాజీవ్ గృహకల్పలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఏర్పాటు

నా ఊపిరి నా సంఘం నూతన అధ్యక్షులు ప్రజా డాక్టర్,గోల్లూరి రాజు
మానవ హక్కుల కోసం నేను ఉన్న ప్రధాన కార్యదర్శి సురేష్
నా ఆలోచనకు పునాది పడింది ఉపాధ్యక్షురాలు పాడుగుల రూప చంద్రమౌళి.



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 01(పిసిడబ్ల్యూ న్యూస్):** అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు మంగళ పూరి వెంకటేష్ (నాలుగో వార్డ్ మాజీ కౌన్సిలర్) మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప కాలనీ, 2 బిహెచ్ కే హౌసింగ్ కాలనీ, అహ్మద్ గూడ లో ఉండే బిసి, ఎస్ సి,ఎస్ టి మైనారిటీ వర్గాల నుంచి అంబేద్కర్ నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది అని వారు తెలియ చేయడం జరిగింది. ఈ సంఘం భవిష్యత్తులో అంబేద్కర్, పూలే ఆశయాలను ప్రజల్లోకి ముందుకు తీసుకెళ్తామని, సమాజంలో మత వివక్ష, కుల వివక్ష, లింగ,వర్ణ వివక్ష లేకుండా ప్రజలంతా సమానమేనని చాటి చెబుతూ.. భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ, భారత రాజ్యాంగంలోని విలువలని నేటి తరానికి తెలియజేయవలసిన బాధ్యత తమ పైన ఉందని వారు తెలియజేశారు.అనంతరం ప్రధాన కార్యదర్శి వి సురేష్ మాట్లాడుతూ..కుల వివక్ష, మత వివక్ష, లింగ,వర్ణ వివక్ష, అణిచివేతలు లేకుండా సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని.. సంఘ నిర్ణయాలు కట్టుబడి ఉంటామని, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే, పెరియార్, కాన్సిరాం, సిద్ధాంతాలని పాటిస్తూ సమాజంలో జరుగుతున్న అణచివేతలని,అసమానతలని వివక్ష లను తన వంతుగా తొలగించే ప్రయత్నం చేస్తానని వారు తెలియజేయడం జరిగింది. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ భారత రాజ్యాంగం పైన జరుగుతున్న దాడిని తప్పకుండా ఎదుర్కోవడానికి ఈ సంఘం ముందుంటుందని వారు తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని హక్కులని, ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫలాలను అందరికీ న్యాయంగా దక్కేలా కృషి చేస్తామని తెలియజేశారు. ముఖ్య సలహాదారులు తిరుపతి గారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు లేని సమాజానిర్మానం కోసం ఈ సంఘం పనిచేస్తుందని, అంబేద్కర్ ఆశయాలని వారు కోరుకున్న సమాజాన్ని తీసుకురావడంలో తమవంతుగా ప్రయత్నం చేస్తామని వారు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు ఈగ రాజు, పాడుగుల రూప చంద్రమౌళి మాట్లాడుతు అంబేద్కర్ అంటే ఒక పేరు కాదు మన ఆత్మ అన్నారు,ప్రతి ఆదివారం జ్ఞానమాల కార్యక్రమంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని వారు తెలియజేయడం జరిగింది. పూలే,అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని వారు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో సంఘం కోశాధికారి గాలి సురేష్, ముఖ్య సలహాదారులు అబ్బులు, తిరుపతి , గుజ్జుక పరశు రాములు , బందెల స్వామి, సంపత్, వి స్వామి సలహాదారులు మాదాసి రవి, రాజ్ కుమార్, ఆనందాసు ప్రకాష్, జగన్నాధం, రంగయ్యఉపాధ్యక్షులు డి జ్యోతి, యూనిస్ బాయ్, సాయి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత,రంగయ్య, పాండు, విష్ణు,వెంకటేష్,జాయింట్ సెక్రెటరీలు నరేష్, కన్నయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీస్‌నామాడి రాజా,సందీప్, జి రామకృష్ణ,మరియు కమిటీ సభ్యులుపి ఎల్లయ్య, కొమురయ్య, కంతి రాజయ్య,ఎండి కాజా గౌస్ ,దాసు, డి.అజయ్, పి.నాగరాజు, పాడుగుల చంద్రమౌళి స్వేరో, కే శ్యాం సుందర్ రావు, పి శ్రీనివాస్, సిహెచ్ బాబు.మరియు మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబా, మాల సంక్షేమ సంఘం నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు, పార్టీల నాయకులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# హుజురాబాద్‌లో కాంగ్రెస్ విజయభేరి..



3వ వార్డులో ప్రణవ్ బాబు ప్రచార హోరు, అభ్యర్థి ప్రభాకర్‌కు బ్రహ్మరథం పట్టిన ఓటర్లు...



**హుజురాబాద్, ఫిబ్రవరి 01(పిసిడబ్ల్యూ న్యూస్ ):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పురపాలక సంఘ ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మూడవ వార్డులో తమ దూకుడును ప్రదర్శించాయి. ఆదివారం జరిగిన ముమ్మర ప్రచారంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు పాల్గొని, పార్టీ అభ్యర్థి రావుల ప్రభాకర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా వార్డులో కాంగ్రెస్ శ్రేణులకు స్థానిక ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. మహిళలు హారతులు పట్టి, యువత భారీ కేకల మధ్య అభ్యర్థికి ఘనస్వాగతం పలికారు. ప్రణవ్ బాబు మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు కేవలం ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనే సాకారం అయ్యాయని గణాంకాలతో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి గడపకు చేరుతున్నాయని, ఈ అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు.వార్డు అభ్యర్థి రావుల ప్రభాకర్ ప్రతి గడపకూ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక వసతుల కల్పనే తన తొలి ప్రాధాన్యత అని ఆయన ఓటర్లకు భరోసా ఇచ్చారు. ప్రజలు తమపై చూపిస్తున్న ఈ అభిమానం చూస్తుంటే కాంగ్రెస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వార్డులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించాలంటే చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కీలక నేతలు, వార్డు ఇన్చార్జిలు, అనుబంధ సంఘాల నాయకులు మరియు వందలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో 3వ వార్డు పరిసర ప్రాంతాలు మారుమోగిపోయాయి. అభివృద్ధికి పట్టం కడతామని, ఈసారి తమ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని ఓటర్లు ముక్తకంఠంతో హామీ ఇవ్వడం గమనార్హం.



# 36 ఏళ్ల నిర్విరామ వైద్య సేవలకు ఘన వీడ్కోలు

**- టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు**

**- ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్ గ్రేడ్1 ల్యాబ్ టెక్నిషియన్ బాజినేని రత్తయ్య పదవీ విరమణ**





**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో గ్రేడ్1 ల్యాబ్ టెక్నిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బాజినేని రత్తయ్య, ఫిబ్రవరి 1 పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా ఆదివారం టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో సహా ఉద్యోగులు ఘనంగా అభినందన సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. దాదాపు 36 సంవత్సరాల పాటు ప్రభుత్వ వైద్య సేవల్లో అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం, బయ్యన్నగూడెం గ్రామంలో జనవరి 2, 1965న బాజినేని గురువులు, అన్నపూర్ణమ్మలకు ఆరుగురు సంతానంలో ఒకరు బాజినేని రత్తయ్య. విద్య పట్ల చిన్ననాటి నుంచే ప్రత్యేక ఆసక్తి కలిగిన ఆయన 1981లో పదవ తరగతి నుండి 1988లో ఎం.ఎ (సైకాలజీ) పూర్తి చేశారు. జూలై 7, 1990న గవర్నమెంట్ సివిల్ హాస్పిటల్, వెంకటగిరిలో గ్రేడ్2 ల్యాబ్ టెక్నిషియన్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందారు. మధిర, తల్లాడలో సీనియర్ ల్యాబ్ సూపర్వైజర్‌గా సేవలందించారు. 2022 2024లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా ఖమ్మంలో విధులు నిర్వర్తించారు. 2024లో జూలూరుపాడు, తిరిగి ఖమ్మం జనరల్ హాస్పిటల్‌కు వచ్చి ఇక్కడే పదవీ విరమణ చేయడం విశేషం. రతయ్యకు భార్య రమాజ్యోతి, కూతురు అలేఖ్య, అల్లుడు సునీల్ కుమార్, మనుమరాలు ఆహాన, కుమారుడు అనూప్ చక్రవర్తి, కోడలు రూప చౌదరి, మనుమడు అర్జున్ ఉన్నారు. తన సేవలకు గుర్తింపుగా వైద్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయిా అవార్డులను అందుకున్నారు. వైద్య రంగంలో క్రమశిక్షణ, నిబద్ధత గల వ్యక్తిగా వారు కొనియాడారు. పదవీ విరమణ అనంతర జీవితం మరింత ఆరోగ్యకరంగా, ఆనందోత్సాహాలతో సాగాలని అధికారులు, సహోద్యోగులు ఆకాంక్షించారు. తోటి ఉద్యోగులు, స్నేహితులు, బంధువులు, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పుంగమ్మ చెరువు కట్టను పరిశీలించిన చల్లా బాబు





**అన్నమయ్య జిల్లా: పుంగనూరు ఫిబ్రవరి 1 (పి.సి.డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్ట దురాక్రమణలకు గురవుతోందని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, రెవిన్యూ అధికారులు చెరువు కట్టను ఆదివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చెరువు కట్టలు దురాక్రమణలకు గురయ్యే పరిస్థితి ఉండదని అన్నారు. ఎవరైనా దురాత్రములు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో పుంగమ్మ చెరువు అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఏడాది కాలంలోనే హంద్రీనీవా జలాల ద్వారా పుంగనూరుకు నీరు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. స్థానికులతో చర్చించి దురాక్రరములకు పాల్పడలేదని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాము, ఆర్ఐ ఫణికుమార్, సర్వేయర్ శ్రీనివాసులు నాయక్, ఏఎంసీ చైర్మన్ సమీపతి యాదవ్, విశ్రాంత డీఎస్పీ, తెలుగుదేశం నాయకులు సుకుమార్ బాబు, మాధవరెడ్డి, శ్రీకాంత్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్య రోడ్డుపై చెత్త కుప్పలు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు...



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 01(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని రాజీవ్ చౌక్ నుంచి మూడవ పట్టన పోలీసు స్టేషన్ వెళ్ళే ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సంచులు, మిగతా వ్యర్థాలు ఎక్కడికక్కడ పడివుండటంతో పరిసర ప్రాంతం దుర్గంధంగా మారింది. అదే విధంగా రహదారిపై ఇనుప సరిసల కట్టలు, ఇసుక కుప్పలు కూడా ఉండటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు క్రమం తప్పకుండా చెత్తను తొలగించకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, రోడ్డుపై చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, నిర్మాణ సామగ్రిని రహదారులపై నిల్వ చేయడంపై నియంత్రణ తీసుకురావాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీ ముఖ్యమంత్రిపై అంబటి రాంబాబు అసభ్యకర వ్యాఖ్యలు దుర్మార్గం





**- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, ఖమ్మం జిల్లా ఇన్చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్**

**- తీవ్రంగా ఖండించిన ఖమ్మం జిల్లా టీడీపీ నేతలు**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అంబటి రాంబాబు చేసిన అసభ్యకర వ్యాఖ్యలు దుర్మార్గమని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, ఖమ్మం జిల్లా ఇన్చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, వడ్డేం విజయ్ లు అన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర నాయకులు, ఖమ్మం ఇన్చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, వడ్డే విజయ్, లు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ... మా జాతీయ నాయకుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుని చెప్పలేని విధంగా అసభ్యకరంగా మాట్లాడిన అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలని, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఇలా తిట్టడం అనేది ఘోరమైన చర్య, ఇలాంటి దుర్మార్గులను ఉపేక్షించేది లేదనీ, ప్రతిపక్ష హోదా కూడా లేని వైసిపి నేతలు ఇలా గుండాల వలే ప్రవర్తించడం సరికాదని అన్నారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం, వ్యక్తి నీ ఉద్దేశించన భాష అత్యంత హేయమైనదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి ఇలాంటి “బూతు పురాణం“ అందుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అన్నారు. ఇది వ్యక్తిగత దూషణ, అసభ్యతతో, సంస్కారహీనమైన భాషతో కూడుకున్నదన్నారు. ఇది తెలుగు రాజకీయ సంస్కృతిని దిగజార్చేలా ఉందని, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తిపై బహిరంగంగా బూతులు మాట్లాడటం రాజ్యాంగాన్ని అవహేళన చేసి అగౌరవపరచడమేనన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను ప్రేరేపించేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసభ్య పదజాలంతో మాట్లాడటం చట్టరీత్యా నేరమని ఆమాత్రం మాజీ మంత్రి అంబటి రాంబాబు కు తెలియదా.. కావాలనే విమర్శించారన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణిని పునరావృతం కాకుండా ఇలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలనా దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్లాలని అన్నారు, అనంతరం టిడిపి కార్యాలయం నుండి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీగా బయలుదేరి స్థానిక జిల్లా పరిషత్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని రాజ్యాంగ పరిరక్షణ కోసం అంబేద్కర్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం కొద్దిసేపు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తా సీతయ్య, మందడపు సుధాకర్, వాసిరెడ్డి భాస్కరరావు, గుండెపిన్నీ నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, నల్లమల శ్రీనివాస్, మునగపాటి సంపత్, తలపనేని జయరాం, ఓర్సు కృష్ణ, తాడిశెట్టి స్వాతి, మంగమ్మ, పావని, లావణ్య, కందిబండ నరసింహారావు, చింతనిప్పు నాగేశ్వర రావు, కూచిపూడి జై, కృష్ణ ప్రసాద్, కృష్ణమాచారి, కొలికొండ మురళి, కాసాని బ్రహ్మం, ఎల్లంకి నరసింహారావు, చావా నరేందర్, కోవెలమూడి జగదీష్, ఎర్నం జేమ్స్, వాడపల్లి బిక్షపతి, నారాయణ, శ్రీనివాస్, కర్నాటి సీతారాములు, పాల్గొన్నారు.

# బిసివై పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా చనకంటి సాంబమూర్తి,కన్వీనర్‌గా హరిబాబు యాదవ్, యువజన రాష్ట్ర కో కన్వీనర్‌గా పూల ప్రేమ్ కుమార్ నియామకం



చనకంటి సాంబమూర్తి



ఎద్దుల హరిబాబు



పూల ప్రేమ్ కుమార్

**అన్నమయ్య జిల్లా ఫిబ్రవరి 1 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) నూతనంగా ప్రకటించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో పుంగనూరుకు చెందిన సీనియర్ నాయకులు చనకంటి సాంబమూర్తి, కన్వీనర్ గా ఎద్దుల హరిబాబు యువజన రాష్ట్ర కో కన్వీనర్ గా పూల ప్రేమ్ కుమార్‌లను నియమించారు. ఈమెరకు ఆ పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ నియామక పత్రాన్ని వారికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలలో బీసీవై పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో పాడి రైతులు, టమోటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కృషి చేస్తానని అన్నారు. ఈ నియామకం పట్ల సాంబమూర్తి, హరిబాబులు హర్షం వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, ప్రజల గొంతుకగా నిలుస్తామని వారు తెలిపారు. తమకు ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు వీరిని అభినందించారు.

# కనుల పండువగా ‘కళ్యాణ‘ మహోత్సవం..!



**- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**- కూసుమంచిలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత**

**కూసుమంచి, ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల కేంద్రంలో ఆధ్యాత్మిక పరవశం వెల్లివిరిసింది. శ్రీ స్వామివార్ల తిరుకళ్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల తో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

**పట్టువస్త్రాల సమర్పణ :** ఈ వేడుకకు కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, గ్రామ పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివార్ల కళ్యాణ ఘట్టం సందర్భంగా ఆయన పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**లోక కళ్యాణమే లక్ష్యం :** పూజల అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. “స్వామివారి కృపతో కూసుమంచి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిండాలని“ ఆకాంక్షించారు. శాంతి, సమృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నవశకానికి నాంది మోదీ గ్యారెంటీ

**- వికసిత భారత్ నిర్మాణానికి భరోసా**

**- ఇది బడ్జెట్ కాదు.. ప్రపంచ పటంలో భారత్ తలరాతను మార్చే "భవిష్యత్ రాజ్యాంగం"**

**- హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్వే కారిడార్లు.. తెలుగు రాష్ట్రాలకు స్వర్ణయుగం**

**- మధ్యతరగతికి పన్నుల ఊరట.. డేటా సెంటర్లకు వరాల జల్లు**

**- మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ కేవలం ఆదాయ వ్యయాల చిట్టా కాదు.. ఇది 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచ అగ్రరాజ్యంగా నిలబెట్టే 'వికసిత భారత్' మహాద్భుత రాజ్యాంగం. సబ్బండ వర్గాల ఆశల పల్లకిగా నిలిచిన ఈ బడ్జెట్, విపక్షాల నోళ్లు మూయించి దేశ ప్రజల మనసు గెలిచింది" అని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అభివర్ణించారు. ఆదివారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన బడ్జెట్ విశేషాలను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. **హైదరాబాద్ కేంద్రంగా ప్రగతి పరుగులు** ఈ బడ్జెట్ తెలుగు రాష్ట్రాలకు, మరీ ముఖ్యంగా తెలంగాణకు పెద్దపీట వేసిందని కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన 7 హైస్పీడ్ రైల్వే కారిడార్లలో.. పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాలు ఉండటం మన ప్రాంత అభివృద్ధిపై మోదీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇది రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మారుస్తుందని జోస్యం చెప్పారు. **టెక్నాలజీకి పెద్దపీట - యువతకు ఉపాధి బాట** సాంకేతిక రంగంలో భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చేందుకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు యువతకు వరప్రదాయనిగా మారాయని ఆయన పేర్కొన్నారు. సెమీ కండక్టర్ ఇండియా మిషన్ 2.0కు రూ.40 వేల కోట్లు, బయో ఫార్మా శక్తి పథకానికి రూ.10 వేల కోట్లు కేటాయించడం ద్వారా లక్షలాది హై-ఎండ్ ఉద్యోగాలు మన యువత తలుపు తట్టనున్నాయని తెలిపారు. అంతేకాకుండా, 2047 వరకు డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు 'టాక్స్ హాలిడే' ప్రకటించడం ద్వారా డిజిటల్ విప్లవానికి కేంద్రం నాంది పలికిందన్నారు. క్లౌడ్ సేవల రంగంలో ఇది భారీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని విశ్లేషించారు. **మధ్యతరగతికి మోదీ అభయం - పన్నుల్లో భారీ ఊరట** మధ్యతరగతి ప్రజల కష్టాలను గుర్తించి, వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించే నిర్ణయాలను ఈ బడ్జెట్‌లో ప్రకటించారని కోటేశ్వరరావు కొనియాడారు. ఎల్ఆర్ఎస్ కింద విదేశీ చదువులు, వైద్యం కోసం చేసే చెల్లింపులపై టీడీఎస్ ను 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించడం సామాన్యులకు భారీ ఊరటనిస్తుందన్నారు. అలాగే కొత్త ఆదాయపు పన్ను చట్టం ద్వారా సరళతరమైన విధానాలు తీసుకురావడం, చిన్న మదుపరుల ప్రయోజనం కోసం కంపెనీల బైబ్యాక్ విధానాలపై స్పష్టతనివ్వడం మోదీ సర్కార్ దార్శనికతకు అద్దం పడుతోందన్నారు. **రైతు బంధువు మోదీ - గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవం.** దేశానికి వెన్నెముకైన రైతన్నను రాజును చేయడమే లక్ష్యంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు భారీ కేటాయింపులు చేశారని ఆయన గుర్తుచేశారు. తీర ప్రాంతాల్లో కొబ్బరి, జీడిపప్పు, కోకో సాగుకు ప్రత్యేక ప్యాకేజీలు, పశుసంవర్ధక, మత్స్య శాఖలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుందన్నారు. పవిత్ర మాఘపూర్ణిమ నాడు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రైతుల పాలిట అక్షయపాత్రగా మారిందని అభివర్ణించారు. **రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి** కేంద్రం ఇంత భారీ నిధులు, ప్రాజెక్టులు ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ విమర్శలు మాని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నెల్లూరి కోటేశ్వరరావు హితవు పలికారు. టెక్స్‌టైల్ రంగానికి రూ.10 వేల కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మన రాష్ట్రంలో మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. పేదలు, మహిళలు, యువత, రైతులు అనే నాలుగు స్తంభాలపై నిర్మితమైన ఈ బడ్జెట్.. భారత్‌ను 7 శాతం వృద్ధిరేటుతో పరుగులు పెట్టిస్తోందని, ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించే లక్ష్యంతో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోందని వివరించారు. చివరగా, ఇంతటి సాహసోపేతమైన, ప్రజాకర్షక బడ్జెట్‌ను అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఖమ్మం జిల్లా ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ, దేశ ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరి మన్ననలు పొందుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర నాయకులు వక్కలంక సుబ్రమణ్యం , దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్ కుమార్, వీరవెల్లి రాజేష్ గుప్తా, రజిని రెడ్డి, మేకల నాగేందర్, కందుల శ్రీకృష్ణ, కొణతం లక్ష్మీనారాయణ, యార్లగడ్డ రాఘవరావు, బోయల వెంకట్, కోటమర్తి సుదర్శన్, ఫమ్మి అనిత, రవి గౌడ్, బోయినపల్లి సురేష్, మణి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, కోటమర్తి ఉపేందర్, పడేశబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఉచిత శిక్షణ సదస్సు

- రెండు రోజుల ఉచిత వర్క్‌షాప్ నిర్వహణ
- ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.26 వేల ఫీజు కోర్సు ఉచితం
- ఇంటర్న్‌షిప్,ఉద్యోగ అవకాశాలకు దోహదం



**వేంపల్లె ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి. కోనప్ప ఆధ్వర్యంలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ అసోసియేట్" అంశంపై రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి), కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటీషన్స్ వారి భాగస్వామ్యంతో నిర్వహించారు. వర్క్‌షాప్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఐఈఎల్ఐటి అందిస్తున్న రూ.26 వేల ఫీజు కలిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ట్రిపుల్ ఐటీలోని 170 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా అందించేందుకు రిజిస్ట్రేషన్ చేపట్టారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు ఏఐపై ప్రాక్టికల్ శిక్షణ, ఉచిత ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించి,ఉద్యోగాలకు అనుకూలంగా తీర్చిదిద్దనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఈఎల్ఐటి ప్రతినిధులు శ్రీ విద్యాసాగర్, రామమోహన్ రావు, ట్రిపుల్ ఐటీ ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి,ఒంగోలు డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ తిలక్‌తో పాటు పలువురు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పులివెందులలో వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం



**పులివెందుల అర్బన్ ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకను ఈ ఏడాది కూడా భక్తులు బ్రహ్మాండంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి పులివెందుల పట్టణం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు,యువత భారీ సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. గోవింద నామస్మరణతో పుర వీధులు మారుమోగిపోయాయి. పట్టణంలోని ప్రధాన ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర వెళ్లే దారిపొడవునా భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రథం చక్రాల కింద గుమ్మడికాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. యాత్రలో భాగంగా వివిధ పౌరాణిక వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నరసింహ స్వామి,హనుమంతుడు, శ్రీకృష్ణుడు వంటి వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు,ఆలయ కమిటీ సభ్యులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఖమ్మం ఛాంపియన్

- జాతీయస్థాయి పోటీలకు 5గురు విద్యార్థినులు ఎంపిక



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో ఖమ్మం విద్యార్థులు మొదటి స్థానం సాధించి ఛాంపియన్లుగా నిలిచారని ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సామినేని తిరుపయ్య చౌదరి, కార్యదర్శి రఘు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రగ్బీ పోటీలకు 12 మంది విద్యార్థినులు పాల్గొని 5గురు జాతీయస్థాయి కి ఎంపికయ్యారని తెలిపారు. ఈ అద్భుతమైన విజయం నుండి, ఐదుగురు (5) మంది విద్యార్థినులు ఒడిశా, భువనేశ్వర్ 2026లో జరిగిన జాతీయ స్థాయి రగ్బీ పోటీకి ఎంపికయ్యారు. ఇది ఖమ్మం రగ్బీ అసోసియేషన్ కి గొప్ప గౌరవం, గుర్తింపును తెచ్చిపెట్టిందన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను బహుమతులతో అభినందించి సత్కరించారు. ఈ విజయం విద్యార్థుల అంకితభావం, క్రమశిక్షణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు అందించిన అద్భుతమైన కోచింగే ప్రతిబింబిస్తుందన్నారు. జాతీయస్థాయి రగ్బీ పోటీకి ఎంపిక కావడానికి విశేష కృషిచేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పి. ప్రేమా రాణి, ఎన్. నాగేంద్రమ్మ, పి. సునీత లకు ఈ సందర్భంగా కృతజ్ఞ తలు తెలియజేశారు. **జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు :** ఎమ్.డి ఆఫ్రిన్, సుజాత, క్రిథిక (అండర్/15 తెలంగాణా కెప్టెన్), సాయి ప్రహర్షిణి, ఎస్.కె. సనా ఉన్నారు. రగ్బీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సామి నేని తిరు పయ్య చౌదరి, కార్యదర్శి రఘు నాయక్ ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ తరుపున క్రీడాకా రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట

**ఏపీ అభివృద్ధికి బలమైన పునాది**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు**

**అమరావతి ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో దాని విస్తరణకు రూ.155.32 కోట్ల కేటాయింపులు చేయడం కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ దేశ వ్యవసాయ రంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆయన కొనియాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు భూమి సారాన్ని కాపాడుకునే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లాంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలకు ఈ కేటాయింపులు ఎంతో ఉపయోగకరంగా మారతాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. రైతుల ఆదాయ వృద్ధికి స్పష్టమైన దిశ ఈరోజు కేంద్ర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కేంద్రంగా రూపొందిన ఈ బడ్జెట్ రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. రిజర్వాయర్లలో చేపల పెంపకం, మత్స్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. అలాగే పశు సంవర్ధక శాఖకు ప్రోత్సాహకాలు పెంచడం పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. **అధిక విలువ కలిగిన పంటలకు ప్రోత్సాహం** వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ కలిగిన పంటలకు కేంద్రం ప్రోత్సాహం ఇవ్వడం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమని మంత్రి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం వంటి పంటల సాగుకు ప్రోత్సాహం ఇవ్వడం దీర్ఘకాలికంగా రైతులకు లాభదాయకంగా మారుతుందని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం ప్రకటించడం, కాయలు కాయని పాత చెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి సాయం అందించడం ద్వారా తోటల ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. **ఎన్డీఏ ప్రభుత్వంలో ఏపీ అభివృద్ధి వేగం** ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసాన్ని ఈ బడ్జెట్ మరింత బలపరుస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- నేడు సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ: డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప ఫిబ్రవరి 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :-** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు. సభాభవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా



ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ " అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారుడయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమండయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.